సాక్షి తిరుపతి

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



జిల్లాలో జోరు వాన

తిరుపతి జిల్లాలో శనివారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. - 8లో



ఆగమోక్తంగా అంకురార్పణ

తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలకు శనివారం ఆగమోక్తంగా అంకురార్పణ గావించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	26
చిత్తూరు	34	25
తిరుమల	29	22
గూడూరు	35	28
నగరి	34	26

న్యూస్‌రీల్

నిరాడంబరంగా..తుడా చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



తుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) చైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం నిరాడంబరంగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీశక్తి చాముండేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకుని.. తిరుపతిలోని తుడా కార్యాలయానికి విచ్చేశారు. తుడా వీసీ హరికృష్ణ, కార్యదర్శి లక్ష్మి తీసుకువచ్చిన ఫైళ్లపై సంతకం చేసి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తుడా చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న అభినవ పూలే



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ఆంధ్రరాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు అభినవ పూలే సీఎం జగనన్న అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కొనియాడారు. శనివారం ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీటీడీ పాలక మండలి సభ్యుల నియామకంలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే నాయీబ్రాహ్మణుడిని టీటీడీ చరిత్రలో మొదటి సారిగా నియమించడం హర్షణీయమన్నారు.



నాపేరు శారదమ్మ. మేము 50 ఏళ్లుగా భగత్ సింగ్ కాలనీలో నివాసముంటున్నాము. మా ఇళ్లకు పట్టాలు లేవు. ఇబ్బందులొచ్చినా బ్యాంక్ రుణం కూడా ఇవ్వరు. గతంలో చాలామంది నాయకులకు సమస్య చెప్పాము. పరిష్కరిస్తామని హామీ ఇచ్చి గాలికొదిలేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక అన్ని సమస్యలూ పరిష్కారమవుతున్నాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుతున్నాయి. నిషేధిత జాబితా నుంచి మా భూములు తొలగిస్తూ జీవో తెచ్చారు. మా కలలు నిజం చేశారు. పిల్లల భవిష్యత్‌కు భరోసా ఇచ్చారు. సీఎం జగన్, ఎమ్మెల్యే భూమనకు రుణపడి ఉంటాం.



మాది తిరుపతి నగరంలోని సుందరయ్య నగర్. నాపేరు కే.శ్రీనివాసులు. మేము నలభై ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నాము. అయితే ఇక్కడున్న ఇంటి స్థలానికి ఎటువంటి ఆధారం లేదు. నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఎంతోమంది అధికారులను కలిశాం. నాయకుల చుట్టూ తిరిగాం. కానీ ఉపయోగం లేకుండా పోయింది. గత ఎన్నికల సందర్భంగా భూమన కరుణాకరరెడ్డి మా ఇంటి స్థలాల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జీవో తెప్పించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి చొరవతో మా కల నిజమైంది. ఆధారం దొరికింది.




బైరాగిపట్టెడలోని భగత్‌సింగ్ కాలనీలో సీఎం జగన్, టీటీడీ చైర్మన్ భూమన, అభినయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న స్థానికులు

పట్టాభిషేకం.. కరుణా కటాక్షం!

ఆరు దశాబ్దాల కల నెరవేరింది. ఎన్నో చిక్కులతో పెనవేసుకుపోయిన సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవ బాధితులకు వరంగా మారింది. నిషేధిత జాబితాలో ఇళ్లు నిర్మించుకున్న జనానికి కొత్త ఊపిరి వచ్చినట్టయ్యింది. ఈ మేరకు సీఎం జగన్ ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అసలు నిషేధిత భూములేంటి..?.. సమస్య ఎందుకు.. ఎలా పరిష్కరించారు.. తదితరాలపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..

- ఆధ్యాత్మిక నగరంలో..పట్టాల పండగ!
- 22(ఏ)లోని భూముల్లో ఇక రిజిస్ట్రేషన్లు
- దశాబ్దాల సమస్య ఎట్టకేలకు పరిష్కారం
- ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- టీటీడీ చైర్మన్ భూమన చొరవపై సర్వత్రా హర్షం



సాక్షి, తిరుపతి: ఆధ్యాత్మిక తిరునగరి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. నాలుగేళ్లుగా రవాణా సౌకర్యాలతోపాటు మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. ట్రాఫిక్ చిక్కుముళ్లు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి. నగరానికి అనుసంధానంగా స్మార్ట్ రోడ్లు రూపుదిద్దుకుంటున్నాయి. ఆధునిక హంగులతో అత్యాధునిక ప్రభుత్వ భవనాలు నిర్మితమవుతున్నాయి. సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్న స్థానికుల సమస్యలూ చిటికెలో పరిష్కారమవుతున్నాయి. నిషేధిత భూముల్లో ఆవాసాలేర్పర్చుకున్నారన్న వారి సమస్యలూ పటాపంచలవుతున్నాయి.

నిషేధిత భూములు ఇవే

తిరుపతిలో వాటర్ కోర్స్ పోరంబోకు స్థలాలుగా పరిగణిస్తూ నగరంలోని తంబువానిగుంట, కొర్లగుంట, కొత్తపల్లి, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, ఎరుకల కాలనీ, జర్నలిస్ట్ కాలనీ (ఎర్రమిట్ట), కసం గడ్డ-కెనడీ నగర్, భగత్ సింగ్ కాలనీ (ఓబులేసు కాలనీ), సుందరయ్యనగర్, శారదానగర్, సూరయ్యకట్ట, చెన్నారెడ్డి కాలనీ, సంజీవయ్యనగర్, సింగాలగుంట, నరసింహతీర్థం రోడ్డు, తాతయ్యగుంట, బొమ్మగుంట ప్రాంతాల్లోని స్థలాలను నిషేధిత జాబితా 22(ఎ)లో చేర్చారు. ఈ 17 ప్రాంతాల్లోని 104 ఎకరాల పరిధిలో ఆవాసాలేర్పరుచుకున్న 5,341 మంది తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 60 ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు చేసుకోలేక.. కళ్లముందే ఆస్తులున్నా అవసరానికి వాడుకోలేక దయనీయ పరిస్థితులు అనుభవిస్తున్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై స్థానికులు ఉప్పొంగిపోయారు. శనివారం సీఎం వైఎస్.జగన్, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తమకు అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా ఉంటామని ప్రతినబూనారు.

కరుణన్న మాట..అభివృద్ధి బాట

గత సార్వత్రిక ఎన్నికల్లో సందర్భంగా నీటి ఆవాసానికి ఏ మాత్రం అవకాశం లేని జనాలతో నిండిన ప్రాంతాలకు విముక్తి కల్పిస్తానని భూమన కరుణాకరరెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ పెద్దలతో చర్చించి న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి నడుంబిగించారు. పలు దఫాలుగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లారు. కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులతో అనేక మార్లు చర్చించారు. భూమన చొరవతో ఎట్టకేలకు సీఎం జగన్ ప్రభుత్వం స్పందించింది. నిషేధిత జాబితా నుంచి సంబంధిత భూములను తొలగిస్తూ జీఓ విడుదల చేసింది.

తండ్రికి తగ్గ తనయుడు



డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తిరునగరి అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. నగరానికి సరైన కనెక్టివిటీ లేకపోవడంతోనే ట్రాఫిక్ సమస్య పెరుగుతోందని గుర్తించారు. స్మార్ట్ సిటీలో భాగంగా తిరుపతిని అందంగా ముస్తాబు చేయాలని భావించారు. స్మార్ట్ రోడ్ల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. నగరంలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను ఒక్కొక్కటీ పరిష్కరిస్తున్నారు. ఇందులో భాగంగా నిషేధిత భూముల్లో ఆవాసాలేర్పర్చుకున్న వారి సమస్యల పరిష్కారానికి పలు దఫాలుగా కౌన్సిల్ సమావేశాల్లో లేవదీశారు. తండ్రి భూమన సహకారంతో సమస్య పరిష్కరించారు.

4న పట్టాల పంపిణీ

నిషేధిత జాబితాలో నివాసాలేర్పరుచుకన్న బాధితులకు సెప్టెంబర్ 4వ తేదీన పట్టాలు పంపిణీ చేయనున్నట్టు రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు.

కలలో కూడా ఊహించలేదు



ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నాము. మా ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ చేస్తారని, పట్టాలు వస్తాయని కలలో కూడా ఊహించలేదు. చాలా ఆనందంగా ఉంది. ఆ ఏడు కొండల స్వామి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని చల్లగా చూడాలి. – పుణ్యమ్మ, బైరాగిపట్టెడ, తిరుపతి

రుణపడి ఉంటాం



జీవితంలో మరిచిపోలేని రోజు ఇది. సంతోషకరమైన వార్త తెలిసింది. మా స్థలాలకు హక్కు కల్పిస్తున్నట్టు జీవో విడుదలైంది. ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు. – అంకయ్య, సుందరయ్య నగర్

గతంలో పట్టించుకోలేదు



గతంలో ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. రిజిస్ట్రేషన్ చేయిస్తామని, పట్టాలు ఇస్తామని హామీలిచ్చినా గాలికొదిలేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక వాళ్లు ఇచ్చిన మాటప్రకారం అన్నీ చేస్తున్నారు. మా కలలను నిజం చేశారు. పిల్లల భవిష్యత్తుకు భరోసా ఇచ్చారు. సీఎం జగన్, ఎమ్మెల్యే భూమనకు రుణపడి ఉంటాం. – పుష్ప, జైభీమ్ నగర్, తిరుపతి

విద్యార్థి చదువుకు ఆర్థిక భరోసా



విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం, బ్రాహ్మణపల్లెకు చెందిన వీ.శివకృష్ణ నాయుడు ఉన్నత చదువుల కోసం త్వరలో అమెరికా వెళ్లనున్నాడు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగా ఉండడంతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాయలంలో శివకృష్ణనాయుడుకు రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో రత్నంరెడ్డి, స్వర్ణమూర్తి, హరి పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట



నాగలాపురం పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే ఆదిమూలం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన డెప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆదిమూలం

- నాగలాపురం పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి

వరదయ్యపాళెం/నాగలాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని, ఫలితంగా పేద ప్రజలకు గ్రామస్థాయిలో వైద్యసేవలు దగ్గరవుతున్నాయని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురంలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులుతో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారని తెలిపారు. 14ఏళ్లుగా ముఖ్యమంత్రిగా పరిపాలించిన చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీకి చెందిన వారికే లబ్ధి చేకూర్చారని ధ్వజమెత్తారు. సంస్కారం లేని చంద్రబాబు, ఆయన తనయుడు పిచ్చికూతలు కూస్తూ రాష్ట్రంలో రెచ్చగొట్టే పరిస్థితులకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో సత్యవేడు నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పేద ప్రజల వైద్యసేవలకు ప్రభుత్వ ఆస్పలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.4 కోట్లతో నాగలాపురం, చిన్న పాండూరు పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మించి పేద ప్రజల వైద్యసేవలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. నాగలాపురం–చిన్న పాండూరు ప్రధాన రోడ్డును ఎన్నికల లోపు సింగిల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ సీఎం జగనన్న నేతృత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, ఆర్అండ్‌బీ డీఈ అమరనాథ్‌రెడ్డి, టీటీడీ మాజీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, జిల్లా జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, సురుటుపల్లి పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, మండల పార్టీ కన్వీనర్లు అపరంజిరాజు (నాగలాపురం), నాయుడు దయాకర్‌రెడ్డి (వరదయ్యపాళెం), గవర్ల కృష్ణయ్య (కేవీబీపురం), రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీ.భాస్కర్ నాయుడు, రైతు సలహా మండలి అధ్యక్షుడు చిన్నదొరై, కార్పొరేషన్ డైరెక్టర్లు లాల్‌బాబు యాదవ్, బొప్పన తిలక్‌బాబు, నియోజకవర్గ నాయకులు దామోదర్‌రెడ్డి, చిన్నా, నందకుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,529 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,227 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

ఎంజీఎం సంస్థల సేవలు అభినందనీయం



ఓచర్లను విడుదల చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: ఎంజీఎం సంస్థల సేవలు అభినందనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. ఎంజీఎం సంస్థల చైర్మన్ గుడ్డూరు మల్లికార్జుననాయుడు జన్మదినం సందర్భంగా ఎంజీఎం ఆస్పత్రి వద్ద సుమారు వంద మంది రక్తదానం చేశారు. అదేవిధంగా శ్రీకాళహస్తి ప్రజల ఆరోగ్యం దృష్ట్యా అతి తక్కువ ధరకే ఫ్యామిలీ హెల్త్‌కార్డులను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో గూడ్లూరు మయూర్, వైద్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి వృద్ధుడి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ట్రాక్టర్ కిందపడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని పూడి దళితవాడలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం.. పూడి గ్రామానికి చెందిన పెద్ద పెంచలయ్య(77) శనివారం అదే గ్రామానికి ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. పెంచలయ్య ట్రాక్టర్ కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏడేళ్ల కరెంట్ కష్టాలకు చెక్

- ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో పేరూరులో విద్యుత్ వెలుగులు
- ఎన్‌ఓసీలు పంపిణీ చేసిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- రూ.12 కోట్లతో విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఆధునికీకరణ

తిరుపతి రూరల్: రిజిస్ట్రేషన్లు జరిగిన భూములను గత ప్రభుత్వం 22ఏ లిస్ట్‌లో పెట్టింది. గ్రామం విస్తరించడంతో ఇంటి నిర్మాణాలు జోరుగా సాగాయి. తీరా ఇళ్లు నిర్మించుకున్నాక ప్రభుత్వ భూముల్లో కట్టారు కాబట్టి మీకు కరెంటు కనెక్షన్లు ఇవ్వం...అంటూ ఏడేళ్లుగా వేధించారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కరెంట్ ఇస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట నెరవేర్చుతూ ఇళ్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరికీ ఎన్‌ఓసీ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఏడేళ్ల కరెంటు అవస్థలకు శుభం కార్డు పడింది.

తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీలో విద్యుత్ మీటర్ల జాతర నెలకొంది.



పేరూరులో ఇళ్లు నిర్మించుకున్నవారికి ఎన్‌ఓసీలు జారీచేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

దాదాపు ఏడేళ్లుగా కరెంట్ కనెక్షన్ లేక చాలా మంది అవస్థలు పడ్డారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో వారి జీవితాల్లో వెలుగులు నింపారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత ప్రాతపదికన విద్యుత్ కనెక్షన్‌కు అవకాశం కల్పించారు. శనివారం పేరూరు పంచాయతీలోని ధర్మరాజుల ఆలయ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. లబ్ధిదారులకు మీటర్ కనెక్షన్లకు అవసరమైన ఎన్‌ఓసీలను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందజేశారు. మొదటి దశలో 365 మందికి ఎన్‌ఓసీలు అందజేశారు. లబ్ధిదారులు సైతం మోహిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుమ్మలగుంట తరహాలోనే పేరూరు పంచాయతీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ విద్యుత్ మీటరు మంజూరు చేయడం బాధ్యతగా భావిస్తున్నామన్నారు. అదనపు రుసుం ఎవరూ చెల్లించవద్దని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారని చెప్పారు.

రూ.30 కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణం

పేరూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు రూ.30 కోట్లతో జూపార్కు, సీమల్లవరం, గొల్లపల్లి, వకుళమాత ఆలయాల పరిసరాల్లో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నట్లు తుడా చైర్మన్, వైఎస్సార్సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. పేరూరు వాసులకు త్వరలో ఇంటి పన్నులు కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌ఓసీల ద్వారా దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో విద్యుత్ మీటర్‌ను అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, ఉప సర్పంచ్ పరంధామరెడ్డి, ఎంపీటీసీలు మూలం చంద్రమోహన్‌రెడ్డి, నవనీతమ్మ, డివిజన్ అధ్యక్షుడు చెంచు మోహన్‌యాదవ్, పంచాయతీ పార్టీ అధ్యక్షులు జానకిరామరెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,540
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,438
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,800
రిటైల్ వెండి గ్రాము	రూ.77.80

ఘనంగా ఉమెన్స్ ఈక్వాలిటీ డే

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఉమెన్స్ ఈక్వాలిటీ డేని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా డాక్టర్ తోట అనుపమ విచ్చేసి ప్రసంగించారు. మహిళల హక్కులు, సమానత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలకు అన్నింటిలోనూ పురుషులతో సమానంగా హక్కులు ఉన్నాయని గుర్తు చేశారు. ధైర్యంగా, స్వతంత్రంగా సమస్యలు ఎదుర్కొన్నప్పుడే మహిళల జీవితం సార్థకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్ రామసుబ్బారెడ్డి, అరవిందకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ జయచంద్ర, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ చంద్రకళ, మునిశంకర్ పాల్గొన్నారు.

ఎంబీయూలో ఆన్‌లైన్ సదస్సు

చంద్రగిరి: మోహన్‌బాబు యూనివర్సిటీలో డేటా అనాలటిక్స్, స్మార్ట్ కంప్యూటింగ్, నెట్‌వర్క్ అనే అంశంపై మూడు రోజుల పాటు దాసరి ఆడిటోరియంలో అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. చివరి రోజు శనివారం యూకేలోని బ్రూనెల్ యూనివర్సిటీ కంప్యూటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ గినియా బుల్స్, ఇథియోపియా నుంచి డాక్టర్ డెరేజ్ యొహాన్నెస్, సూరత్ కల్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్ చంద్రశేఖరన్, పుదుచ్చేరి ఎన్‌ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్రన్‌లు ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు తాజా అన్వేషణ పద్ధతులు, ప్రస్తుత స్థితి, అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంబీయూ వీసీ ఆచార్య నాగరాజ రామారావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్‌తోనే అన్ని పనులను చేసుకోవాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సారథి, రీసెర్చ్ డీన్ ఈశ్వర్, ఇన్నోవేషన్ డీన్ శ్రీనివాసులు, డేటా సైన్స్ హెచ్‌ఓడీ రమణి, కన్వీనర్లు బషీర్, జ్యోత్స్న పాల్గొన్నారు. ఈ సదస్సులో 450 మంది ప్రతినిధులు పాల్గొని పరిశోధన పత్రాలను అందజేశారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంబీయూ వీసీ ఆచార్య నాగరాజ రామారావు



ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న ప్రొఫెసర్లు

● జిల్లాలో జోరు వాన



తిరుపతి జిల్లా వ్యాప్తంగా జోరు వాన కురిసింది. శనివారం సాయంత్రం 20 నిమిషాల పాటు చిరుజల్లులు పడ్డాయి. అలాగే రాత్రి 9 నుంచి భారీ వర్షం కురిసింది. తిరుపతి నగరంలో రెండు గంటల పాటు జోరు వాన కురవడంతో లోతు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు నగరంపై ఏరులై పారింది. వర్షపు నీటికి కాలువలు పొంగి ప్రవహించాయి. ఇళ్లకు చేరుకోవాల్సిన ఉద్యోగులు, వ్యాపారులు, సిబ్బంది ఎక్కడికక్కడ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. - తిరుపతి తుడా

ఆగమోక్తంగా అంకురార్పణ

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామికి ఏడాది పొడవునా ఉత్సవాలు, సేవలు నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలను విశిష్ట కైంకర్యంగా చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. తెలిసీతెలియక జరిగే దోషాల నివారణార్థం మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు. కల్యాణ వెంకన్న ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం పుట్టమన్నును ఊరేగింపుగా శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అంతకుముందు పండితులు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద విశ్వక్సేన ఆరాధన, నవగ్రహారాధన అష్టదిక్పాలక ఆరాధన, కలశ స్థాపన నిర్వహించారు. విశ్వక్సేనుడికి అంకురార్పణ పూజలు నిర్వహించారు. అనంతరం హారతులు, నైవేద్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.




పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు, చిత్రంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మి

స్విమ్స్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి తుడా: టీటీడీ స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్‌గా డాక్టర్ ఆర్‌వీ.కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ జేఈఓ, స్విమ్స్ డైరెక్టర్‌గా ఉన్న సదాభార్గవి నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఆయన హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ప్రముఖ సీటీ సర్జరీ విభాగాధిపతిగా సేవలందించారు. ఈ క్రమంలో ఆయనను స్విమ్స్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు తీసుకుంటున్న డాక్టర్ ఆర్‌వీ కుమార్



తరలిరండి...!
తప్పక రండి...!
మూడు తరాల మనిషి
కవి,రచయిత,వక్త
పరిశోధకుడు, పరిపాలకుడు,
మానవతావాది,ప్రకృతి ప్రేమికుడు
రాయలసీమ యుద్ధగళం
అణగారిన ప్రజల యుద్ధ స్వరం
భూమన్
అభినందన, ఆవిష్కరణ సభ
వేదిక : యస్.ఆర్. కన్వెన్షన్ (పాత వేంకటేశ్వర థియేటర్), తిరుపతి
తేది & సమయం : ఆగష్టు 27, ఆదివారం, ఉదయం గం॥ 9.20 ని॥లకు
కన్వీనర్
కన్వీనర్
మానవ వికాస వేదిక, తిరుపతి

క్లుప్తంగా

నేడు రెవెన్యూ అధికారుల సర్వే పరీక్ష

తిరుపతి అర్బన్: తిరుపతిలో గ్రామ రెవెన్యూ అధికారుల సర్వే పరీక్ష ఆదివారం గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్నట్టు జేసీ డీకే.బాలాజీ తెలిపారు. ఆ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


చెస్ పోటీలో తలపడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు

తిరుపతి సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లా రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ డిపార్ట్‌మెంట్ ఇంజినీర్ల (ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్) ఆధ్వర్యంలో ఉమ్మడి రాయలసీమ జిల్లాల జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమైంది. ఇందులో ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ మీట్‌లో శనివారం క్రికెట్, చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించ నున్నట్లు ఆర్గనైజింగ్ సభ్యులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 2023–2024 విద్యా సంవత్సరానికిగాను ప్రాక్ శాస్త్రి కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నటుల రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించా రు. పూర్తి వివరాల కోసం httpr://nrktu.ac.in వెబ్‌సైట్‌ను వీక్షించాలని కోరారు.

ఐటీఐ అప్రెంటీస్‌కు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆర్టీసీ పరిధిలో అప్రెంటీస్ చేయడానికి సెప్టెంబర్ 8వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రజారవాణాధికారి జితేంద్రనాద్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో డీజిల్ మెకానిక్స్ 8, మోటార్ మెకానిక్స్ 6, ఎలక్ట్రీషియన్ 8, వెల్డర్ 4, పెయింటర్ 2, ఫిట్టర్ 1, డ్రాఫ్టమన్ సివిల్ 1 మొత్తం 102 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల వారు www.apprenticerhipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9949810012, 9154291408 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్: తిరుపతి– చంద్రగిరి మధ్య ఓ వ్యక్తి కేరళ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. తిరుపతి స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి వయసు 50 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 9440627638లో సంప్రదించాలని సూచించారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు చూపుతున్న సీఐ శ్రీనివాసులు

తిరుపతి క్రైమ్: వాహన దొంగలను క్రైమ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన సాయికుమార్, గణేష్ అలియాస్ జోసఫ్ ముఠాగా ఏర్పడి గత కొంతకాలంగా నగరంలోని ఆటోలు, ద్విచక్ర వాహనాలు దొంగలించేవారు. వీరిని కరకంబాడి రోడ్డులోని బీటీఆర్ కాలనీ వద్ద శనివారం అరెస్ట్ చేసినట్టు తెలిపారు. వీరు పాత నేరస్తులుగా గుర్తించామన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో బస్టాండ్ల సమీపంలో ఉన్న పార్కింగ్‌ను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడేవారన్నారు. వారి నుంచి రూ.14 లక్షల విలువ చేసే 6 ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

శనేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల అభిషేక సేవ అనంతరం శనేశ్వరస్వామికి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదటి గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేలం, కలశ జలాలతో అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో సుమారు 25 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వెంకటగిరిలో 8న మెగా జాబ్‌మేళా

సైదాపురం: వెంకటగిరి పట్టణంలో సెప్టెంబర్ 8వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు నియోజకవర్గ కన్వీనర్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఈ-క్రాప్ భరోసా


పంటలను ఈ క్రాప్ చేస్తున్న ఉద్యోగులు

ఖరీఫ్‌లో పంటల సాగు వివరాలు ఎకరాల్లో	
వరి	56,675
వేరుశనగ	7,193
సజ్జ	3,660
చెరకు	3,778
నువ్వులు	278
పత్తి	145
ఇతర పంటలు	2,002

ఉద్యాన పంటలు	
మామిడి	50,710
నిమ్మ	6,780
కూరగాయలు	2,597
పూలతోటలు	987
పండ్లతోటలు	970
ఇతర పంటలు	568

- ముమ్మరంగా ఖరీఫ్ పంటల నమోదు
- జియో ఫెన్సింగ్ సిస్టమ్‌లో ప్రక్రియ
- విధిగా పంట ఫొటో తీయాల్సిందే
- సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక


ఉద్యాన పంటలను ఈ క్రాప్ చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈ–క్రాప్ నమోదు ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దెబ్బతింటే పరిహారం అందించేందుకు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభం కాగా.. సెప్టెంబర్ 15 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు 1,36,343 ఎకరాలు ఉండగా.. ఇందులో ఇప్పటికే 1,24,125 ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తయింది. జూలై 4వ తేదీ నుంచి ఈ– క్రాప్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మరో 12,218 ఎకరాల్లో ఈ–క్రాప్ చేయాల్సి ఉంది.

కార్యాచరణ ఇలా...

జూలై 4వ తేదీ పంటల ఈ–క్రాప్ కార్యక్రమం ప్రారంభించారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. తర్వాత 16 నుంచి 30వ తేదీ వరకు ఈ–క్రాప్ పూర్తి చేయించుకున్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. అనంతరం అక్టోబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కలెక్టర్, జేసీ, వ్యవసాయశాఖ జేడీ, ఏడీఏలు సూపర్ చెక్ పేరుతో ఈ–క్రాప్ చేయించుకున్న రైతుల జాబితాను పరిశీలిస్తారు. క్షేత్ర స్థాయిలోనే ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారు. అక్టోబర్ 16 నుంచి 31వ తేదీ వరకు సోషల్ ఆడిట్‌ను నిర్వహించి రైతులకు డిజిటల్, మాన్యువల్ రసీదులు ఇవ్వనున్నారు. మొత్తంగా అక్టోబర్ చివరికల్లా ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ మేరకు ఈ క్రాప్ చేయించుకున్న రైతులకు ప్రభుత్వం రాయితీలను పంపిణీ చేయనుంది.

ఈ క్రాప్ ప్రక్రియ పటిష్టం

పారదర్శకత కోసం వ్యవసాయశాఖతోపాటు రెవెన్యూశాఖ సమష్టిగా ఈ క్రాప్ చేయించడంలో ప్రభుత్వం భాగస్వాములను చేసింది. గ్రామస్థాయిలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు పంటను నమోదు చేస్తారు. అనంతరం నమోదు చేసిన డేటాను వీఆర్వోలు ధ్రువీకరించాల్సి ఉంది. ఆ తర్వాత మండల వ్యవసాయ అధికారి లాగిన్‌కు, అనంతరం తహసీల్దార్ లాగిన్‌కు వివరాలు వెళ్లనున్నాయి. వెబ్‌ల్యాండ్ డేటాను ప్రామాణికంగా తీసుకోవడంతో పొరపాట్లుకు తావులేకుండా ఉండేందుకు అవకాశం ఏర్పాట్లు చేపట్టారు. వెబ్‌ల్యాండ్‌లోని ప్రతి సర్వే నంబర్‌కు రైతు ఆధార్, మొబైల్ నంబర్ అనుసంధానమై ఉంటుంది. ఈ–కర్షక్ యాప్‌కు ఆర్‌బీకేలు, రెవెన్యూ గ్రామాలను మ్యాపింగ్ చేశారు. యాప్‌లో రైతు ఆధార్ నంబర్‌ను నమోదు చేస్తే భూమి వివరాలు ప్రమరితమవుతాయి. సాగు వివరాలను నమోదు చేయడంతోపాటు క్షేత్రస్థాయిలో పంట ఫొటో తీసి యాప్‌లోకి అప్‌లోడ్ చేస్తారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారుల వివరాలను కూడా యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

వంద శాతం పూర్తిచేస్తాం



ఈ క్రాప్ నమోదు సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది. అప్పటికి 100 శాతం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. ఈ క్రాప్‌తో రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రైతు పంట ఈ క్రాప్‌ను విధిగా చేసుకోవాలి.

– ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఎంతో ప్రయోజనం



ఈ పంట నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులు అందుకోవడానికి అవకాశం ఉంటుంది. రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదు.

– ఆనందయ్య, ఇల్లుపూరు గ్రామం, సూళ్లూరుపేట మండలం

ఈ క్రాప్ చేయించుకోండి



ఉద్యాన పంటల సాగుకు సంబంధించి ప్రతి రైతు ఈ క్రాప్ చేయించుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖను ప్రోత్సహించడానికి అనేక రాయితీలు ఇస్తోంది. రుణాలు అందిస్తోంది. పంటలను రైతులే విక్రయించుకోవడానికి వీలుగా చర్యలు చేపట్టింది.

– దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

సీఎం సార్‌కు కృతజ్ఞతలు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో రైతులకు సాయం చేయలేదు. ఒక్కప్పుడు వ్యవసాయం అంటే ఎంతో కష్టంతో కూడుకున్న పని. అయితే ప్రస్తుతం వ్యసాయం సులభంగా మారింది.

–శ్రీనివాసులురెడ్డి, కురుకొండ గ్రామం, ఓజిలి మండలం రైతు

రౌడీరాజ్యం తేవాలని చూస్తున్న బాబు


మాట్లాడుతున్న మంత్రులు

తిరుపతి మంగళం: రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ రౌడీ రాజ్యం తేవాలని చూస్తున్న చంద్రబాబుకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి పెద్దిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో చంద్రబాబు, లోకేష్ టీడీపీ కార్యకర్తలు, గూండాలను రెచ్చగొట్టి అరాచకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. దాడులు చేసి కేసులు పెట్టించుకున్న వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని బహిరంగంగా లోకేష్ చెప్పడమే వారి అరాచకాలకు నిదర్శనమన్నారు. మానత్వం మరిచి ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులపై టీడీపీ గూండాలు చేసిన దాడులు రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు.

హాజరు శాతం పెంచండి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో విద్యార్థుల హాజరుశాతం సర్వేపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సర్వే వేగవంతం చేయాలన్నారు. బడిఈడు పిల్లలు వంద శాతం బడిలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆ మేరకు క్షేత్ర స్థాయిలో విద్యాశాఖ అధికారులు పిల్లలతోపాటు వారి తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల ఇన్‌చార్జి సుశీలాదేవి, నాడు– నేడు ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, సర్వశిక్ష అభియాన్ సీఎంఓ సురేష్, శివశంకరయ్య, డీవైఈఓలు ఆనందరెడ్డి, శివప్రకాష్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత


ఏఎస్ఎల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 28న విద్యాదీవెన రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా నగరి నుంచి ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఏఎస్ఎల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 28న సోమవారం ఉదయం 9.45 గంటలకు ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి 9.55 గంటలకు హెలికాప్టర్‌లో నగరికి బయల్దేరుతారన్నారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి మధ్యాహ్నం 1.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. 1.55 గంటలకు ఇక్కడి నుంచి గన్నవరం బయల్దేరి వెళ్తారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత అధికారులకు ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ కమాండెంట్ కున్వర్ బహదూర్, ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు గిరిధర్, రవీంద్రరెడ్డి, డీఎంహెచ్ఓ శ్రీహరి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రమణయ్య, జిల్లా రవాణా అధికారి సీతారామిరెడ్డి, రేణిగుంట తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ నూతన కార్యాలయంలో పూజలు


తిరుమలలోని టీటీడీ చైర్మన్ నూతన కార్యాలయ భవనం


హారతి ఇస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

తిరుమల: తిరుమలలోని పద్మావతి విశ్రాంతి గృహం సమీపంలోని నూతనంగా నిర్మించిన టీటీడీ చైర్మన్ కార్యాలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పూజలు నిర్వహించారు. అనంతరం నూతన కార్యాలయంలో ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, సీవీఎస్వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుపై అవగాహన ఉండాలి


సదస్సును ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: పన్ను చెల్లింపుల పట్ల ఎప్పటికప్పుడు వస్తున్న విధానాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని చిత్తూరు జాయింట్ కమిషనర్ సేల్స్ ట్యాక్స్, సెంట్రల్ ట్యాక్స్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ పాత్ర, జితేంద్ర పిలుపు నిచ్చారు. తిరుపతి సేల్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్స్ అసోసియేషన్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సేల్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఓ ప్రైవేటు హోటల్‌లో ట్యాక్స్ చెల్లింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. సదస్సు చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ప్రతినిధులు విజయ్‌కుమార్, కోట సునీల్, షరీఫ్‌ఖాన్, శ్రీనివాసరావు, నరసింగరావు, గోపాల్, నాగభూషణం, రామకృష్ణ, పద్మనాభం, నర్రా హరినాథ్, వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది సభ్యులు పాల్గొన్నారు.

క్రీడారంగంలో మహిళల సత్తా

- కేలో ఇండియా ఉమెన్స్ పెన్‌కాక్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం


పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న వీసీ భారతి

తిరుపతి సిటీ: క్రీడారంగంలోనూ మహిళలు సత్తా చాటుతున్నారని, ఇది శుభపరిణామమని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ భారతి ఆనందం వ్యక్తం చేశారు. పద్మావతి మహిళా వర్సిటీ, భారత క్రీడా మంత్రిత్వశాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా శనివారం వర్సిటీలో కేలో ఇండియా ఉమెన్స్ పెన్‌కాక్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రెండు రోజులు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది మహిళా అథ్లెట్లు పాల్గొంటున్నారని తెలిపారు. మహిళలను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు ముందడగుగా ఈ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్ రజనీ, చిత్తూరు జిల్లా పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ చైర్మన్ చంద్రశేఖర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి సారా సరోజిని పాల్గొన్నారు.

సంస్కారహీనులు చంద్రబాబు, లోకేష్


మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

- ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజం

వరదయ్యపాళెం: రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ సంస్కారహీనులుగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. సత్యవేడు నియోజకవర్గం నాగలాపురంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వాస్పత్రి భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలసి ఉపముఖ్యమంత్రి పాల్గొని, అనంతరం జరిగిన బహిరంగ సమావేశంలో నారాయణస్వామి మాట్లాడారు. చదువుకునే రోజుల్లోనే తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో కులాల మధ్య చిచ్చు పెట్టిన ఘనత చంద్రబాబుదన్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, లోకేష్‌లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అసభ్య పదజాలంతో మాట్లాడడం నీచమైన సంస్కృతి అని అన్నారు. తండ్రిగా చంద్రబాబు, తనయుడు లోకేష్‌కి ఎలా రాజకీయాల్లో ఎలా మాట్లాడాలో, మెలగాలో కనీస సంస్కారం నేర్పలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రెప్పపాటు సైగ చేస్తే రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ సైనికులు టీడీపీ వారి వాగుడుకు సరైన రీతిలో బుద్ధి చెప్పారన్నారు. అలాంటి సంస్కృతికి వైఎస్సార్ సీపీ దూరమని, ప్రజలు సైతం చంద్రబాబు వెకిల చేష్టలు ఓర్పుతో చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటు రూపంలో బుద్ధి చెప్తారని తెలిపారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి నూతన ఆలోచనలకు దేశంలోనే అన్ని రంగాల్లో రాష్ట్రం ముందుండడం చూసి, ఓర్వలేక చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు అల్లర్లు సృష్టించి ఈనాడు, ఆంధ్రజ్యోతి ద్వారా బాకా వాయించుకుని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు ప్రతిపక్షనేత కుట్రలు ఏమీ పనిచేయవని ధ్వజమెత్తారు. జగనన్న ఆలోచనలు ప్రజా సంక్షేమం ముందు లోకేష్ కుట్రలు ఏమాత్రం పనిచేయవని ఎద్దేవా చేశారు.

రౌడీయిజంపై ఉక్కుపాదం


సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి

తిరుపతిక్రైం: రౌడీయిజంపై ఉక్కుపాదం మోపాలని అనంతపురం రేంజ్ డిఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం మహిళా వర్సిటీ సావేరీ సమావేశ మందిరంలో ఆయన జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలసి జిల్లా పోలీసు అధికారులతో శాంతిభద్రతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలతో పాటు అసాంఘిక శక్తుల విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో అలసత్వం వద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఏ కేటగిరి రౌడీషీటర్ల అణిచివేత, నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా వారిపై ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు పూర్తి చేసి, చార్జిషీటు ఫైల్ చేయాలన్నారు. కోర్టు విచారణ సజావుగా జరిపించి, నేర నిరూపణ అయితే జైలు శిక్ష అమలు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. రౌడీ షీటర్లు బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చి ఏదైనా కొత్త నేరాలకు పాల్పడితే కోర్టు అనుమతితో బెయిల్‌ను రద్దు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులపై సర్కిల్ వారీగా సమీక్షించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏ కేటగిరి రౌడీషీటర్లు ఏదైనా కేసులతో సంబంధం ఉంటే ఆ కేసు ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నదనే విషయం గమనించి, త్వరగా దర్యాప్తు చేసి, నిందితులకు శిక్ష పడేలా చేయాల్సిన బాధ్యత సదరు దర్యాప్తు అధికారిపై ఉందన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర, విమల కుమారి, మునిరామయ్య, ఎస్పీ డీఎస్పీ గిరిధర్ పాల్గొన్నారు.

ఇక్కడ విసిరితే ఆత్మకూరులో పడ్డారు!


వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: 'నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ని. గేమ్ బాగా ఆడుతా.. గేమ్ తెలియని కొందరు ఆడడానికి వచ్చారు. ఇక్కడ బాల్ విసిరితే ఆత్మకూరులో పడ్డారు.. పోటీలో ఏమాత్రం తగ్గేదేలే' అంటూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆనం రామ్‌నారాయణరెడ్డిని ఉద్దేశించి హాట్‌కామెంట్ చేశారు. పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణం వద్ద గుణకాల లక్ష్మీప్రసన్న చారిటబుల్ ట్రస్టు, యువసేన అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువసేన ఇంటర్ – కాలేజ్ స్పోర్ట్స్ మీట్–2023 క్రికెట్, వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలుత నియోజకవర్గ పరిధిలోని ప లు మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ముచ్చటించారు. అనంతరం క్రీడాకారులకు టీషర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు క్రీడల్లో నైపుణ్యం, ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ సేతరాసిబాలయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతుశారద, మహిళా విభాగం నాయకురాలు ధనియాల రాధ, ప్రముఖ న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు, విశ్రాంత ప్రిన్సిపల్ బీకే.ప్రసాద్, రమణారెడ్డి, యువసేన నిర్వాహకులు గిరీష్‌రెడ్డి, అఖిల్, దినేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోటాపోటీగా క్రికెట్ పోటీలు


భరత్‌రెడ్డి


ప్రకాష్

వెంకటగిరి రూరల్: ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తారకరామ క్రీడా ప్రాంగణంలో సౌత్ జోన్ అండర్–16 క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారం అనంతపురం– కడప, కర్నూలు– చిత్తూరు జట్ల మధ్య క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గ్రౌండ్–1లో అనంతపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లకు 133 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50 ఓవర్లకు 179 పరుగులు చేసి రెండు వికెట్లు కోల్పోయింది. ఈ జట్టులో భరత్‌రెడ్డి 96 పరుగులు చేశారు. అనంతపురం జట్టుపై కడప జట్టు 46 పరుగుల ఆధిక్యంలో దూసుకుపోతోంది.

గ్రౌండ్–2లో

కర్నూలు– చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 60 ఓవర్లకుగాను 175 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టులో సాయిగణేష్ 49, జహీర్ అ హ్మద్ 42 పరుగులు చేశారు. చిత్తూరు జట్టు బౌలింగ్ విభాగంలో ప్రకాష్ 5, ప్రశాంత్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 30 ఓవర్లకు 99 పరుగులు చేసి వికెట్ కోల్పోయింది. ఈ జట్టులో టీజీకే ప్రసాద్ 54, సోహన్‌రెడ్డి 29 పరుగులు చేశారు.